# గూడు-గోడు

"ఎప్పుడు ఖాళీ చేస్తున్నారు!" హనుమంతరావు సూటిగా అడిగాడు ఏకాంబరాన్ని.

గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లుంది ఏకాంబరంకి. భావరహితంగా చూశాడు.

"ఇంకో నెల్లోపు ఖాళీ చెయ్యాలి" ఖచ్చితంగా చెప్పాడు.

'ఇల్లు వెతుకుతున్నాం... దొరకలేదు' సంజాయిషీగా చెప్పాడు ఏకాంబరం.

"బావుంది... నేను వేరే ఇల్లు కూడా వెతికిచూపించాలా?"

ఆయన మనసు చివుక్కుమంది. తను ఏనాడూ అద్దె బకాయి పడలేదు. ఠంచనుగా మొదటి తారీకున అద్దె చెల్లించేవాడు. పదేళ్ళుగా ఉన్న అనుబంధాన్ని తెంపేస్తూ ఇంటి ఓనరు వానరుడిలా ప్రవర్తిస్తున్నాడు.

"చూడండి హనుమంతరావుగారూ.... పదేళ్ళుగా ఈ ఇంట్లో కాపురం చేస్తున్నాం. ఏరోజూ మీకు ఇబ్బందీ కలిగించలేదు. మీరు ఎన్నిసార్లు అద్దె పెంచినాకిమ్మనకుండా ఇచ్చాం. అటువంటిది మానవత్వంతో కొంత టైి ఇవ్వలేరా?" ఆవేదనతో అడిగాడు.

"నిజమే కానీ మా కొడుకూ కోడలూ ఈ ఊరికి వచ్చేస్తున్నారు. మా అబ్బాయికి ట్రాన్స్‌ఫర్ అయింది. వచ్చేనెల ఇక్కడికి వచ్చేస్తున్నామని రాశారు. మా పోర్షన్ ఇరుకవుతుంది. వాళ్ళు సామానుతో వచ్చేస్తున్నారు. మాకవసరమని ఖాళీ చేయమన్నా, తప్పేనా?"

"ఇక్కడ తప్పొప్పుల ప్రశ్నకాదు కావల్సింది-మానవతా దృక్పథం." చెప్పారు ఏకాంబరం.

"అందుకే గదా ఇన్నిసార్లు చెబుతోంది."

"సరే! ప్రయత్నిస్తామండీ... పొమ్మన్నా పోకుండా వుండటానికి నేనేం అంత చేతకానివాణ్ణికాదు. కానీ, మీరు అద్దె పెంచాలనుకుంటే చెప్పండి ఎంతో..."

"అబ్బా! అద్దెకాదండి సమస్య... ఇల్లుకావాలి" వెళ్ళాడు హనుమంతరావు.

"మామగారూ... ఆయన్ని ఎందుకంత బతిమాలుతారు? ఇంకో ఇల్లు చూసుకొని పోదాం" కోడలు మీనాక్షి సలహా ఇచ్చింది.

"అదికాదమ్మా! అబ్బాయి చూస్తూనే వున్నాడు కదా... అద్దెలు విపరీతంగా పెరిగిపోయాయి. అది కూడా అడ్వాన్సు బుకింగ్‌లో జరిగిపోతోంది. ఇది అన్నిటికీ సెంటర్‌లో ఉన్న ఇల్లు. ఈ సౌకర్యం మరేచోట రాదుకదా!" నిట్టూర్చారు ఏకాంబరంగారు.

"కానీ... ఆత్మాభిమానం చంపుకుని ఇలా ఎన్నినెలలు?"

"కోర్టుకుపోతే స్టే ఇస్తారమ్మా... కానీ అది నాకు మంచిపని అనిపించదు. ఈరోజు నుండి నేను కూడా ప్రయత్నిస్తాను... కానీ టౌనులో ఇళ్ళు దొరకడం కష్టం. దొరికినా అద్దె

భరించి నెట్టుకురావడం కష్టం..."

"ఫర్వాలేదు... ఊరికి దూరంగానే పోదాం...."

"కాని... అమ్మాయికి కాలేజీకి దూరం. అబ్బాయికి ఆఫీసుకు దూరం. ఏది కావాలన్నా టౌన్‌కి రావాల్సివుంటుంది."

"తప్పదు. జీవితంలో చేసిన పొరపాటుకు...." మీనాక్షి మాటలు మింగేసి లోనికెళ్ళింది.

ఆమె మాటలు ములుకుల్లా గుచ్చుకున్నాయి.

బాదం చెట్టు కిందకొచ్చి కూర్చున్నాడు. చల్లటి నీడ! ఎంతో హాయిగా వుంది. ఆ నీడకోసమే ఇన్ని తిప్పలు పడాల్సివస్తుంది.

తలమీద ఏదో పడినట్టయింది. చేత్తో తడిమి చూసుకున్నాడు – కాకిరెట్ట!

కోపంగా తలెత్తి పైకి చూశాడు.

ఓ కాకి ముక్కుతో పుల్లను కరుచుకుని చెట్టుకొమ్మపైన వాలి వుంది. ఎదురుగా తయారైన కాకి గూడు.

ఛీ! ఛీ! వెధవకాకి. గూడు కడుతున్నది. రేపన్నా దీన్ని పడగొట్టాలి.

హనుమంతరావుకు విశ్వాసంలేదు! తన దగ్గర అవసరార్థం చాలాసార్లు అప్పుకూడా తీసుకున్నాడు వడ్డీ ఇస్తానన్నా తను తీసుకోలేదు. చివరికి ఇప్పుడు అంత నిర్దయగా ఇంట్లోంచి వెళ్ళిపొమ్మంటున్నాడు.

"అయ్యో! ఇక్కడున్నారా?" శకుంతలమ్మ వెతుక్కుంటూ వచ్చింది కాఫీ గ్లాసుతో.

"ఆ! ఆ హనుమంతరావు చూడూ... ఎలా పీకలమీద కూర్చున్నాడో ఇల్లు ఖాళీ చేయమని." తన బాధ వెళ్ళబోసుకున్నాడు.

"అంటాడు అంటాడు ఇల్లు తనదికదాన్న ధీమా!"

"ఎన్నివేలు ఇచ్చాను. ఇల్లును ఎంత బాగుచేసుకున్నాం... ఎన్ని చెట్లను నాటి పెంచాను. ఇప్పుడు ఇల్లు కావాలి, అర్జెంట్‌గా ఖాళీ చెయ్యమంటున్నాడు."

"మీ పిచ్చిగాని... ఎన్నాళ్ళున్నా.... ఎంతచేసినా... అద్దె ఇల్లు సొంతం అవుతుందటండీ?" కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది శకుంతలమ్మ తోటవంక చూస్తూ.

"నా మాటవిని ఓ ఇల్లు కట్టుకుని ఉంటే ఈనాడు ఇలా వీధిన పడాల్సిన రోజు వచ్చేదికాదు" శకుంతలమ్మ పాతరోజులు గుర్తు తెచ్చుకుంటూ నిష్ఠూరమాడింది.

"అదికాదే! అప్పుడు ఇంతలేసి అద్దెల్లేవు... అద్దె ఇంటికి ఇంత డిమాండ్ ఉండేదికాదు. ఇంటి వాళ్ళకు ఇంత అధికారమువుండేదికాదు." చెప్పాడు ఏకాంబరం.

కాసేపటికి వాడిపోయిన మొహంతో రఘురాం వచ్చాడు ఇంటికి. ఇళ్ళకోసం సెలవుపెట్టి తిరిగి అసిలిపోయాడు. ఒకటీ అరా ఉన్నా అవి తమ స్తోమతలో వుండడంలేదు.

"బాబూ! రఘూ! ఇవ్వాళ కూడా హనుమంతరావు వచ్చి గుర్తుచేసిపోయాడు" ఏకాంబరం కొడుకునుద్దేశించి చెప్పారు.

"గంగలో దూకమను. ఇల్లు దొరకడం లేదు. ఇది వదిలామంటే ఇంత సెంటర్‌లో దొరకదు."

"నిజమేరా! అలా అని అతనికి ఇబ్బంది కలిగించకూడదుగా" శకుంతలమ్మ అంది.

"ఏంటమ్మా! మనం ఊరికే ఉంటున్నామా? అద్దెకేగా?"

ఏకాంబరంగారు రిటైరయి రెండు సంవత్సరలాయింది. ఉపాధ్యాయ వృత్తిలో మంచిపేరు సంపాదించుకుని రిటైరయ్యారు. ఆయన అల్ప సంతోషి. ఏ రోజు తిండి ఆరోజు ఉంటేచాలు! అలాగే అసౌకర్యం కలగనంత వరకూ అద్దె ఇంట్లో జీవితం గడిపేశారు.

కాని ఇవ్వాళ వీధినబడి అద్దె ఇళ్ళకోసం వేట మొదలు పెట్టాక తాను ఎంత తెలివి తక్కువ పనిచేసిందీ అర్ధమైంది.

తెలివి తక్కువ వాళ్ళు ఇళ్ళు కష్టపడికడితే...

తెలివిగల వాళ్ళు సుఖంగా కాపురం చేస్తారన్న సామెత ఆయనకు ఒంట బట్టింది.

పాతిక సంవత్సరాల క్రితం పిత్రార్జితం... అమ్మితే ఓ ఇరవై వేలు చేతికందింది. అప్పట్లో ఒక ఇల్లు కొనమని.... లేక కట్టమని శ్రీమతి పోరు పెట్టింది.

కాని అమెను తెలివి తక్కువ దాని కింద లెక్కేసి ఆ సలహా పాటించక ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వేశాడు భవిష్యత్‌లో పనికొస్తుందని.

కానీ ఆనాడు తమ రూపాయి విలువ ఇంతగా పడిపోతుందని ఊహించలేదు. ఎంత వడ్డీతో ఇచ్చినా ఇపుడు ఫిక్స్‌డ్ డిపాజిట్‌కు స్థలం కూడా రాదు.

కానీ ఆ కాలంలో కొత్త ఇల్లు అమ్మకానికొస్తే... భంగపడినా తనుకొనలేదు.... ఇప్పుడది ఆరు లక్షల ఖరీదైంది.

వెతికి వెతికి శోష వచ్చింది కాని ఇల్లు దొరకలేదు. "అమ్మాయి రాధా! ఇక్కడెక్కడా ఇళ్ళులేవమ్మా! నువ్వు బస్సులో రాగలిగితే ఔట్ స్కర్ట్సు వెళదాం! మంచి ఇల్లు దొరుకుతుంది అద్దెకూడా తక్కువ ఉంటుంది!"

పోనూ పోనూ.... మంచినీటి కరువు, గృహవసతి కరువు! ఆఖరికి స్వచ్ఛమైన గాలి కూడ దొరకడంలేదు.

కలికాలం కాదు–కల్తీకాలం!

పెరుగుతోన్న జనాభాతోపాటు – తరుగుతోన్న ముందు చూపు కూడా మానవాళికి

శాపంలా తయారైంది.

ఆయనకు తనకంటే తన పూర్వీకులు హాయిగా బతికినట్లు తోచింది. అదృష్టవంతులు.

చికాకుగా పచార్లు చేస్తూంటే జీవిత బీమా ఏజెంట్ వచ్చాడు. పట్టుకుంటే బంకలా పట్టుకుంటాడు.

"ఏంసార్! కులాసానా!!"

"ఏదో నీ దయవలన."

"అబ్బాయి లేడా?"

"బయటకు పోయాడు... ఎందుకు?"

"జీవితబీమా చేస్తాడేమోనని"

ఏకాంబరానికి కోపం వచ్చింది. వేళకాని వేళ వచ్చి పాలసీ కోసం పాకులాడతాడు. బాగా బుద్ధిచెప్పాలనుకున్నాడు అతనికి.

"సరే! నువ్వు ముందు ఒక సాయం చెయ్యి!"

"ఒకకంతు కట్టమంటారా?"

"ష్! అదికాదు-మాకు అర్జెంట్‌గా ఓ ఇల్లుకావాలి - అద్దె తక్కువలో ఉంటే మంచిది"

"ఇంకా ఎన్నాళ్ళు ఉంటారండి."

"షటప్! గెటౌట్!" కోపంగా అరిచాడు.

"ఐ మీన్! మీరు ఇంకా ఎన్నాళ్ళు అలా అద్దె ఇళ్ళల్లో ఉంటారండీ అనీ - అంటే అంతకు మించి దురుద్దేశ్యంలేదు"

"అయితే చెట్టు క్రింద ఉండమంటారా?"

"కాదండి మీరు ఊ అంటే అబ్బాయి గార్కి ఇంటి అప్పు మంజూరు చేయిస్తాను."

"ఎవరు బాబూ! అంత ఉదారులు?" ఎగతాళిగా అడిగాడు.

"ఎల్లయి సీనే! మీరు అద్దెకట్టేది అప్పు వడ్డీ కింద కట్టండి - అసలు తీర్చడానికి పాలసీ తీసుకోండి - ఫినిష్! అంతే!" ఇంకో అరగంట క్లాసు తీసుకున్నాడు. అతన్ని వదిలించుకోవడం కష్టమైపోయింది.

"మామగారూ! ఇంకా ఎంతకాలం అద్దె కొంపల్లో ఉందాం?" నిష్ఠూరంగా అడిగింది కోడలు -

నిజానికి ఆ జంటకు సరైన సౌకర్యాలు లేవు. ఓ ఇరుకు గదిలోనే జీవితం వెళ్ళబుచ్చాల్సి వస్తోంది.

కడుపులో ఓ నలుసు పెరుగుతోంది. అప్పుడు ఇల్లు ఇంకా ఇరకాటమవుతుంది.

"ఇప్పట్లో ఇల్లు మన తాహతుకు మించిన పని కట్టలేం"

"మీరలా అనుకుని భయపడే ఇలా కొంపా గోడూ లేకుండా చేశారు!" తన నిరసన తెలియచేసింది కోడలు.

"నిజమేనండి.... మీరు అప్పుడు అప్పు తెచ్చి కట్టినా ఈ పాటికి తీరిపోయి ఇల్లు మనస్వంత మయ్యేది." చెప్పింది భార్య శకుంతల.

"పిచ్చిదానా ఏది శాశ్వతమే? మనం ఎల్లకాలం ఈ లోకంలో ఉంటామా ఈ మూణ్ణాళ్ళ ముచ్చటకు ఎందుకు బాధపడతావు?" మెట్టవేదాంతం వల్లించారు.

కాకులు విపరీతంగా గోల చేస్తున్నాయి బాదంచెట్టు మీద.

ఏకాంబరంగారు లోపలి నుండి ఓ పెద్ద వెదురు బొంగు, బాదం కాయలు కోసేది, తెచ్చారు.

వెదురు కర్రతో కాకుల్ని అదిలించారు. కాకిగూడు పై కొమ్మపైన ఉంది.

ఓ పట్టాన వెదురు బొంగుకు అందడం లేదు... కాని దాన్ని అందుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

"నాన్న! ఏం చేస్తున్నారు?" అప్పుడే వచ్చిన రాధ అడిగింది.

"కాకి గూడమ్మా! ఒకటే గోల - తీసేద్దాం" చెప్పారు.

"తప్పు నాన్నా! అది ఎంత కష్టపడి కట్టుకుందో, దానిని తీసేస్తావా? పాపం కదా నాన్నా! ముమ్ముందు దాని పిల్లల్ని ఆ గూట్లో పెట్టి పెంచుదామనుకుందేమో!" జాలిగా అంది రాధ!

"కాని ఇంకెక్కడా చోట్లు దొరకనట్లు - మన దొడ్లోనే - మన బాదం చెట్టు మీదే..."

"ఆగు నాన్నా! మనదొడ్లోనా? మన బాదం చెట్టా? ఈ ఇల్లు మనదా? నువ్వు కాకి గూడును కూలదోసి ఆ కాకుల్ని గూడులేని పక్షుల్ని చేస్తున్నావు - ఆ ఓనరు మనల్ని బయటకు తరిమి ఇల్లు లేని వాళ్ళను చేస్తున్నాడు?"

"ఏంటి నీ పిచ్చి? కాకులతో మనకి పోలికేంటి?"

"అవును నాన్నా! మనకేం పోలిక! వాటికున్న తెలివి మనకెక్కడిదీ. పెళ్ళి చేసుకుంటాం - పిల్లల్ని కంటాం - కాని గూడుకట్టుకోం - అవి అలాకాదే! జతకట్టగానే గూడు కట్టుకుంటాయి! మనకంటే కాకి నయం నాన్నా! కనీసం పిల్లల్ని పెంచాలని కాకి గూడు కట్టుకుంటుంది - దానికి సొంత గూడు వుంది. మనకి లేదు నాన్నా" అంది రాధ!

రాధ ఘోష గూడులేని గోడులా వినిపించి ఏకాంబరంగారు నిరుత్తరుడయ్యారు.!